# సమర్పణ ప్రార్థన

(స్తుతులు, సమర్పణ, ప్రార్థనలు)

గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2013 వెల. 7:00

# 1. సమర్పణ ప్రార్థన

## (స్తుతులు, సమర్పణ, ప్రార్థనలు)

**స్తుతులు :**

దేవా తండ్రీ! నా నిమిత్తమై సమస్తమును కలుగజేసిన తండ్రీ! అనుదినము మాకు కావలసినవన్నియు అందించుచున్న తండ్రీ! నేను అందుకొనలేని బిడ్డనైనను మానకుండ అందించుచున్న తండ్రీ! నన్ను కలుగజేసిన తండ్రీ! నా ప్రియుడవైన తండ్రీ! నా దేవా! నా ప్రభువా! నా పోషకుడా! నా రక్షకుడా! నా సర్వమా! నీకనేక నమస్కారములు. తండ్రీ! సృష్టిమూలముగా మాత్రమేకాక, నీ కుమారుని మూలముగా కూడ నన్ను నీ బిడ్డగా ఏర్పరచు కొన్నందులకై నీకనేక వందనములు.

నీ దానముల మూలముగాను, నీ సహింపు మూలముగాను, నీ నడిపింపు మూలముగాను, మా కష్టములు నివారణచేయు నీ క్రియల మూలముగాను, నీవు మాకు చేయు ఉపకారముల మూలముగాను నాకు నీవు చూపుచున్న ప్రేమను తలంచుకొని నిన్ను స్తుతించుచున్నాను, గాని నా స్తుతి నీ ప్రేమ ఎదుట ఏ మాత్రము! నా అంతరంగమందున్న కృతజ్ఞత నీ అనంత ప్రేమ ఎదుట ఏ మాత్రము! నేను ఏ పనియు ముట్టుకొనక స్తుతి మాత్రమే చేసినను, అది సహితము నీ కనికరము ఎదుట మిక్కిలి స్వల్పమై యుండును. ఆ స్వల్ప స్తుతులనుకూడ నీవు హస్తార్పణముగా అందుకొను చున్నావు, గనుక నీకు వందనములు. నీవు నన్ను నేటివరకు కాపాడుచు, నడిపించుచు వృద్ధిలోనికి తీసికొని వచ్చుచున్న నీ శక్తిని తలంచుకొని స్తుతించుచు, ఇక ముందునకుకూడా నా విషయములో ఇట్టి

కార్యములు చేయుచుందువని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాను. నా జీవితాంతమందు నిశ్చయముగా నన్ను పరలోకమునకు చేర్చుకొందువని నిరీక్షించుచున్నాను. నీకనేక వందనములు.

2. 1) అనాది దేవా! అనంత దేవా! ఉన్నదేవా! సృష్టిపబడకుండ ఉన్న దేవా! ఈ నీ గొప్పతనమునకు అనేక స్తోత్రములు.

2) అనంత దేవా! నీవు ఎల్లప్పుడు ఉండగల దేవుడవు. గనుక నీకు స్తోత్రములు. నీవు ఎల్లప్పుడు ఉండువాడవు గనుక నీకు అనంత స్తోత్రములు.

3) జీవమైయున్న దేవా! నాలోని జీవము నా బలహీనతను బట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చుచున్నప్పుడు మరల నాలో నూతన జీవము ధారపోయుదువు గనుక నీకు నిత్యజీవ స్తోత్రములు.

4) శక్తిమంతుడవగు దేవా! నా విషయములో ఎంత గొప్ప కష్టమైన పనియైనను, అసాధ్యమైన పనియైనను చేయగలవు గనుక నీకు నా శక్తికొలది వందనములు.

5) జ్ఞానివైయున్న దేవా! నీవు జ్ఞానివి గనుక నా కష్టములు, నా కోరికలు నేను నీకు చెప్పుకొనకముందే నీకు తెలిసేయున్నవి. అందుచేతనే నీవు నా కోర్కెలు తీర్చగలవు. నా కోర్కెలు నెరవేర్చుటకు ఎన్నో చిక్కులు అడ్డముగానున్నను, ఆ చిక్కులన్నియు విడదీసి నా కోర్కె నెరవేర్చగల జ్ఞానోపాయము నీకు గలదు. గనుక నీకు నాకు తెలిసినన్ని వందనములు. నా జ్ఞానమునకు తోచినన్ని వందనములు చేయుచున్నాను.

6) పరిశుద్ధుడవైన దేవా! నీవు నన్నును, సమస్తమును కలుగ జేసినప్పుడు పరిశుద్ధముగానే కలుగజేసినావు గాని పాపప్రవేశమును బట్టి

నాకు అపరిశుద్ధత కలిగెను. అయినను నీ పరిశుద్ధతనుబట్టి నాకు మరల పరిశుద్ధత దయచేయగలవు గనుక నిష్కళంకమైన పరిశుద్ధ మనస్సుతో నీకు స్తుతి చేయుచున్నాను.

7) ప్రేమాస్వరూపివైన తండ్రీ! భూలోకమందలి తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రేమించుటకన్నను, నన్ను నీవు ఎంతో ఎక్కువగా ప్రేమించు చున్నావు. కాబట్టి నీకు నా వందనములు.

8) న్యాయస్వరూపివైన దేవా! నేను పొరబాటులోనున్నప్పుడు న్యాయమైనరీతిగా నన్ను గద్దించి, ప్రేమతో శిక్షించు దేవుడవు గనుక నీకు వందనములు ఆచరించుట న్యాయమైయున్నది. గనుక నీకు వందనములు ఆచరించుచున్నాను.

9) నిరాకారుడవైన దేవా! నా బలహీనతనుబట్టి నేను నిన్ను చూడలేకపోయినను నీవు నన్ను చూచుచున్నావు. నీవు నిరాకారుడవు అయినప్పటికిని నాకు ఉపయోగకరమైన శరీరాకారమును దయచేసినావు. మరియు నా ఆత్మకు నిరాకారము అనుగ్రహించినావు. కాబట్టి నా శరీరముతోను, నా ఆత్మతోను నిన్ను స్తుతించుచున్నాను.

10) సర్వవ్యాపివైయున్న తండ్రీ! నీవు పరలోకమందును, భూలోకమందును అన్ని స్థలములలో నుండగలవాడవు గనుక నీకు స్తోత్రములు. నేను ఎక్కడున్నను నీవు అక్కడుందువు, ఉండగలవు. నీవు నాకు జతగా నుండగలవు, ఉండి సహాయము చేయగలవు. **'నేను ఒంటరిగా నున్నాను'** అను చింత లేకుండా చేయగలవు గనుక నీకు వందనములు. అన్ని స్థలములలో నీకు వందనములు.

11) స్వతంత్రుడవైన ప్రభువా! సమస్త కార్యములు నీయంతటనీవు చేయగల తండ్రీ! నీకు స్తోత్రములు. నేనుకూడ స్వతంత్రముగా పనిచేయగల శక్తి అనుగ్రహింపగలవు. నీమీద మాత్రమే ఆధారపడి నాలోని స్వతంత్రతనుబట్టి, నా కార్యములు చేసికొనగల స్థితి అనుగ్రహించినావు గనుక నీకు స్తోత్రములు, స్వేచ్ఛాపూర్వకమైన స్తోత్రములు. బలవంతముగా కాక కేవలము స్వతంత్రముగా నిన్ను స్తుతింపగోరుచున్నాము. నీ గుణములన్నియు నాకుకూడ అనుగ్రహించుట వలన నీ లక్షణరూపము, నీ కోరిక నాకు అనుగ్రహించినావు. అన్నియు అనుగ్రహించి ఒక్క స్వతంత్ర లక్షణముగాని అనుగ్రహింపకున్న యెడల తక్కినవన్ని ఇచ్చిన ప్రయోజనము లేదు. గనుక స్వాతంత్ర్య లక్షణము ఇచ్చినందుకు స్తోత్రములు.

12) తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను పేరులతో బైలుపడిన త్రియేక దేవుడవైన తండ్రీ! నీ ప్రత్యక్షత విషయమై నీకనేక వందనములు. నీవు నాకు దాగియుండు దేవుడవుకావు గాని బైలుపడు దేవుడవు. నీ లక్షణములు, నీ క్రియలు, నీ గొప్పతనము నాకు బైలుపర్చు దేవుడవు గనుక నీకు వందనములు. నీవు ఒక్కడవుగాను, ముగ్గురుగాను బైలుపడినావు. నీ మర్మము మాకు తెలియదు గాని నమ్ముచున్నాము. నేను నీ యొద్దకు పరలోకమునకు జేరినప్పుడు తెలిసికొనగలను. నా పరిమిత జ్ఞానస్థితితో, నీ అపరిమిత జ్ఞానస్థితిని ఎట్లు తెలిసికొనగలను? అనంతకాలము నీ విషయములు క్రొత్తక్రొత్తగా తెలిసికొనుచునే ఉందును. నీ ప్రత్యక్షతకును నేను తెలిసికొనుటకు అంతములేదు గనుక నీకు అంతములేని స్తుతులు చెల్లించుచున్నాను.

13) మహిమాస్వరూపీ! అనంత స్వరూపీ! నేను నిత్యము నీ మహిమ కొరకు నీ ముఖ దర్శనములో, నీ సన్నిధిలో, నీ సహవాసములో మిగుల ఆనందముగా గడుపగల స్థితి దయచేయుదువని నమ్ముచు నీకనేక వందనములు చేయుచున్నాను.

14) మాకు శరీరమును అనుగ్రహించిన దేవా! నీకు వందనములు. ఈ శరీరము పాపశరీరమైనందున దీనిని పరిశుద్ధ శరీరముగా మార్చుచున్నావు. తుదకు నాకు మహిమ శరీరము ఇచ్చి నీయొద్దకు తీసికొని వెళ్లుదువు గనుక నీకు వందనములు. నీవు మూడు విధములుగా బైలుపడినావు. అట్లే నాకు మూడు విధములైన స్థితులు అనుగ్రహించినావు. జీవము, శరీరము, ఆత్మ అను మూడు స్థితులు దయచేసినందుకు నీకు వందనములు. ఈ మూడు కలిపి నన్ను ఒక వ్యక్తిగా నిలిపినావు గనుక నీకు స్తోత్రములు. నేను ఒక విధముగా నీకు బిడ్డవలెనున్నాను. మరియొక లెక్కకు మూడుగానున్నాను. ఈ విచిత్రమైన సృష్టి నిమిత్తమై నీకు వందనములు. తండ్రీ! నీవు నాకు ఇచ్చినవన్నియు నేను నిలుపుకొనునట్లు నాకు తోడ్పడుదువని నమ్మి నిన్ను వందించుచున్నాను.

3. తండ్రీ! నీ స్థితిని, నీ క్రియలను, నీ దివ్యలక్షణములను నాయెడల ఉన్న నీ తీరును, నీ మహిమను ఎవరు వర్ణింపగలరు? నీకనేక వందనములు.

4. దానకర్తవైన తండ్రీ! నీ ఉచిత దానముల నిమిత్తమై నీకు స్తోత్రములు. గాలి ఉచితము, నేను పన్ను కట్టుట లేదు. ఒకవేళ నేను కట్టినను అది చాలదు. నీ ఉచిత ధర్మము నిమిత్తమై అవి యున్నంతకాలము

నీకు స్తోత్రములు. లోకాన్ని కలుగజేసినది మొదలుకొని, లోకాంతము వరకు నీవు నరులందరకు, అవిశ్వాసులకు, విశ్వాసులకు, మృగములకు, వృక్షాదులకు, జీవరాసులకు ఉచితముగా ధర్మము చేయుచునేయున్నావు. ఇవన్నియు మేము సంపాదించుకొనవలెనన్న యెడల రవ్వంతయైనను సంపాదించుకొనలేము. ఎన్నో పండ్లు, ఎన్నో కూరగాయలు ఇచ్చుచున్నావు. మానవులు తినగా ఎన్నో మిగిలిపోవుచున్నవి. నీకనేక స్తోత్రములు. నీళ్లుకూడ మిగిలిపోవుచున్నవి. నీవు భూమిలో పెట్టిన ఖనిజములు, లోహములు అనేకములున్నవి. మానవులు ఇంకా వీటిని తీసికొని వాడుకొనలేదు. కొన్ని వాడుకొనుచున్నారు గాని తరగడములేదు. నీవు మా యెదుట వేసిన భోజనపు బల్లమీదనున్న పదార్థములు ఇంకా తరగడములేదు. ఒకదరినుండి మేము వాడుకొనుచుండగా, నీవు ఇంకొకదరినుండి ఇంకను క్రొత్తవి ఇచ్చుచూనే యున్నావు. నీ దాన స్వభావమును ఎవరు వర్ణింపగలరు? మా తెలివితక్కువవల్ల మేము వాటిని పూర్తిగా వాడలేకపోవుచున్నాము. నీ దానములు అందుకొనుశక్తి నరులకందరకున్న యెడల అందరును ధనికులే. ఒక్కరైనను బీదవారుండరు. నీవు కలుగజేసిన వాటిలో ఉపయోగములేనిది ఏదియులేదు. నా విషయమై నీకు ప్రతిదినము ఎంతో ఖర్చున్నది. నీవు బిల్లు వేసినయెడల నేను ఇయ్యగలనా? ప్రతి నిమిష దానములనుబట్టి నీకనేక వందనములు.

5. నీవిచ్చిన అన్నిదానములకంటే ఓ తండ్రీ! నీవు నీ కుమారుని పంపిన దానము గొప్పది, అనంతమైనది. ఎందుకు నిన్ను స్తుతింపవలెనని కోరినయెడల ప్రతి రెప్పపాటున స్తుతింపవలెను. నీ కుమారుని అవతార

దానమునకు మించిన దానము లేనేలేదు. ఆ దానమునుబట్టి నీకు స్తోత్రములు. నేను పాపవిసర్జన చేయవలెననియు, బాప్తిస్మము పొందవలెననియు, రక్షణ అందుకొనవలెననియు, సంస్కార భోజనము భుజింపవలెననియు, ఇతరుల రక్షణార్థమైన సేవ చేయవలెననియు, నీ వాక్యగ్రంధమును మా హృదయములో అచ్చు వేయించుకొనవలెననియు, జీవాంతమందు నీ సన్నిధికి వచ్చివేయవలెననియు నీవు కోరుచున్న కోరికకు ఏమి చెప్పగలను. నీ దానములు లెక్కపెట్టుటకు కూర్చున్నయెడల మా దీర్ఘ జీవితకాలము చాలదు. మా విశ్వాసము, మా గ్రహింపు, మా స్తుతి నీ దృష్టి యెదుట మిగుల స్వల్పమైనను నీవు అంగీకరించుట ఆశ్చర్యముగానున్నది. ఏమి చెప్పగలను! ఏమి వివరింపగలను! ఎంత జాగ్రత్తగా స్తుతి చేసినను ఎప్పుడు పూర్తిగా కుదరదు. అయినను నీవు ఆనందించుచున్నావు. నీకు స్తోత్రము. నీ కుమారుని దానమునకు వెలుపల ఏ దానమును లేదు. నీవు చూపుచున్న కృప వెలుపల ఏ కృపయు లేదు. సంఘముయొక్క వెలుపల రక్షణలేదు. నీ మహత్తు విషయమై నీకు లెక్కకు మించిన స్తోత్రములు.

6. నా జన్మము, నా బ్రతుకు ఎంత పవిత్రముగానున్నను, మరణ సమయమందు పరలోకమునకు నేను సిద్ధము కాని యెడల మా ఆయుస్సు అంతయు వ్యర్థమే. ఒకవేళ నేను మరణ సమయమునందు సిద్ధముగా నున్న యెడల మోక్ష ప్రవేశము కలిగించుకొనుటకు ధన్యత కలదు. అంతకన్న మించిన అంతస్థు గల మరియొక ధన్యకాలము కలదు. ఆ కాలమునకు, ఆ రెప్పపాటు కాలమునకు, మా ప్రభువుయొక్క రెండవ రాకడకు నేను సిద్ధపడని యెడల భూమిమీద శ్రమలు అనుభవించుటకు మిగిలిపోవుదును.

నేను అంతకాలము భక్తిగా బ్రతికి, అన్నియు నమ్మి రెండవరాకడను నమ్మకయు, నమ్మినను సిద్ధపడకయు నున్నయెడల నాకు ఎంత దౌర్భాగ్యత దాపురించును? భక్తిగల జీవనము, భక్తిగల మరణము సజీవుల గుంపులో చేరవలసిన ఆరోహణము, మా యెదుట పెట్టియున్నావు గనుక నీకు స్తోత్రములు. లేనియెడల మా బ్రతుకువలన నీకు ప్రయోజనమేమి? ఇట్టి ప్రయోజనములేని స్థితి నాకు రాకుండా చేయగల తండ్రీ! నీకు స్తోత్రము.

# 2. సమర్పణ

1. అతి పరిశుద్ధుడవైన తండ్రీ! నీవు నరజాతి తల్లిదండ్రులను పరిశుద్ధవంతులనుగా చేసినప్పటికిని, వారు పాపములో పడిపోవుటవలన వారినిబట్టి మాకందరికి పాపము ప్రవేశించినది. *ఓ తండ్రీ!* పాపమును *విసర్జించుటకు నాలో శక్తిని అమర్చినావు. గానీ పాపములేకుండా ఉండలేక* పోవుచున్నాను. ప్రయత్నించుచున్నాను, పడిపోవుచున్నాను, మరల నీ యెదుట ఒప్పుకొనుచున్నాను. సూర్యచంద్ర, నక్షత్రముల కాంతి నీ పరిశుద్ధత ఎదుట లోపము కలిగియున్నవి, మరియు పరిశుద్ధులైన దేవదూతల పరిశుద్ధత, నీ పరిశుద్ధత ఎదుట తక్కువైయున్నది. పాపులమైన మేము ఎట్లు నిర్దోషులమై యుండగలము? నీవు క్షమించుటనుబట్టిగాని, లేనియెడల నేను ఇదివరకే నశించి యుండవలసినదే. నా ప్రభువా! నా తలంపులోనికి, నా మాటలోనికి, నా ప్రయత్నములోనికి, నా క్రియలోనికి, పాపము ప్రవేశించినప్పుడెల్ల విసర్జింప పూనుకొనియున్నాను. నీవు సహాయము చేయుదువు. చెడుగు కనబడినప్పుడు, 'ఓ సైతానా! ఇది నీ పని. నా మీద నీకు ఏ అధికారములేదు, వెళ్లిపో' అని ఎదిరించుటకు పూనుకొన్నాను. నా పాపములు ఎప్పటికప్పుడే నీ యెదుట ఒప్పుకొని శుభ్రపడుటకు పూనుకొన్నాను.

2. దేవా! పాపము ఒక్కటే కాదు. పాపము ప్రవేశించి ఊరుకొనుటలేదు, అది వ్యాధిని కలిగించుచున్నది. అట్టి సమయములో నిన్ను వేడుకొని స్వస్థత పొందుటకు పూనుకొన్నాను. ఏ తప్పిదము వలన వ్యాధి చేరినదో తెలిసికొని, క్షమాపణకోరి, స్వస్థత పొందుటకు పూనుకొన్నాను. ఒకవేళ వెంటనే స్వస్థత కలుగకపోయిన యెడల ప్రార్థించి, నీ దీవెనతో ఔషదము వేసికొందును. నీళ్లను ఔషదముగా నీవు నయమాను విషయములో వాడినావుకదా! నరుడు పాపములో పడిపోవుననియు, అందువలన జబ్బు తెచ్చుకొనుననియు నీకు ముందుగా తెలిసి, మూలికాదులు పుట్టించి; అవి ఔషదములుగా వాడుకొను జ్ఞానమును కొందరికిచ్చి, ఔషదములు చేయించుచు అనేకమందిని బాగుచేయుచున్నావు. ఇది నీ అద్భుతమైన కృప. ***అయినను మందులేకుండా ప్రార్థన, విశ్వాస, స్తోత్రముల వలనను స్వస్థత పొందవలెనని నీ నామధారుల విషయములో కోరుచున్నావు.***

3. తండ్రీ! పాపము వలననే ఇబ్బంది, పేదరికము, అప్పుల పాలగుట సంభవించుచున్నది. ఇట్టిది నాకు కలిగిన యెడల విశ్వాస మూలముగానే తొలగించుకొనుటకు పూనుకొన్నాను.

4. ఈ అవస్థలు కాక ఇంకను అనేకమైన అవస్థలు కలుగుచున్నవి. అట్టి సమయములో ప్రార్థనవలననే తొలగించుకొనుటకు పూనుకొన్నాను.

5. పాపమునుబట్టి మరియొక పాపము, అవిశ్వాసము, అధైర్యము, దిగులు, అనిశ్చయత, విసుగుదల, నీ నడిపింపును అపార్థము చేసికొనుట, నీ నిశ్శబ్ధమును గ్రహింపలేకపోవుట; సైతానుకు, శత్రువులకు, గాలి తుఫానుకు, ఎండకు, వానకు, పిడుగులకు, చెడ్డ కలలకు, తప్పుడు

దర్శనములకు, యుద్ధములకు, కరువులకు, వ్యాపించు వ్యాధులకు, విషపురుగులకు, మరణమునకు, నరకమునకు **భయపడక,** నిన్నుబట్టి భయములను నివారణ చేసికొనుటకు పూనుకొన్నాను.

6. పాపపరిహారము, వ్యాధి నివారణ, ఇబ్బంది నివారణ, ఇంకను కావలసినవన్నియు, మోక్షభాగ్యము దయచేయుదువనియు మరియు నీ వాక్యములో వ్రాయించిన వాగ్ధానములన్నియు నమ్ముటకై పూనుకొన్నాను. ముఖ్యముగా యోహాను 14:14లో నున్న వాగ్ధానము, మార్కు 11:24లో నున్న సలహాను నమ్ముటకు పూనుకొన్నాను.

7. పరిశుద్ధాత్మ దేవా! నేను పరిశుద్ధుడనైయున్నట్లు, నీవును పరిశుద్ధుడవై యుండుమని సెలవిచ్చినదేవా! నీకనేక స్తోత్రములు. ప్రతి పాపమునుండి నన్ను దూరపర్చుము. శోధనలోనికి నన్ను రానీయకుము. నాకు తెలిసిన ప్రతి పాపమునుండి తప్పుకొనుటకు పూనుకొన్నాను. నిన్ను మరచియుండుట, నీ మీద విసుగుకొనుట, నీ యెడల కృతజ్ఞత లేకుండుట, ఆరాధనకు వెళ్లుటలో నిర్లక్ష్యము కలిగియుండుట, పెద్దల యెడల అమర్యాదగా నడచుట, కొట్టుట, స్త్రీ పురుషుల యెడల దుర్వాంఛ కలిగియుండుట, ఒకరిది ఆశించుట, అపహరించినది తిరిగి ఇవ్వకుండుట, ఉన్నవి కొన్ని లేనివి కొన్ని ఒకరిని గురించి ఇతరులకు చెప్పి, అల్లరిచేసి పేరు చెడగొట్టుట, అబద్ధములాడుట, తగని రీతిగా కోపపడుట, ఒకరిని ద్వేషించుట తిట్టుట, కుట్రాలోచనలు చేయుట, ఊరుపేరు లేని వ్రాతలు వ్రాయుట, ఇతరుల పాపములలో పాలివారగుట; ఇట్టి పాపములు చేయకుండుటకు పూనుకొన్నాను.

8. కష్టకాలము వచ్చినప్పుడు అదికూడ మేలుకొరకేనని అనుకొనుటకు పూనుకొన్నాను. యథాప్రకారమైన వాడుకలు చేయుటకును, మేలుచేయుట మానకుండుటకును పూనుకొన్నాను. ***రోజులోని ప్రతి సమయమందు నీ తలంపు కలిగియుండుటకును పూనుకొన్నాను.*** లేచుటతోనే నిన్ను స్తుతించుటకును, నీ గ్రంథములోని సంగతులు నేర్చుకొనుటకును, నా కొరకు, అందరికొరకు ప్రార్థించుటకును, కీర్తనలు పాడుటకును, ఇతరులకు నిన్ను గురించి సాక్ష్యమిచ్చుటకును పూనుకొన్నాను. దేవాలయమునకు వెళ్ళుట, మంచి మంచి పత్రికలు చదువుట, పుస్తకములు చదువుట, బీదలకు ధర్మము చేయుట, జీవరాసుల యెడల దయగా నుండుట, ప్రతి అవసరమైన పనుల సమయములలో వెంటనే ప్రార్థనచేయుట, భోజన సమయమందు, నీళ్ళు త్రాగు సమయమునందు, ఎక్కడికైనా వెళ్ళు సమయమందు ప్రార్థించుట కుటుంబ ప్రార్థన చేసికొనుట; రాత్రులందు మెళకువ వచ్చినప్పుడు ప్రార్థించుకొనుట; ఈ మొదలగు మంచి వాడుకలు మానకుండ జరుపుకొనుటకు పూనుకొన్నాను. మరియు నా పోషణార్థమై నేను చేయవలసిన పనులలో, ఉద్యోగములో నమ్మకముగా ఉండుటకు పూనుకొన్నాను.

9. 1) దేవా! నీ చిత్తమే నా చిత్తము. నీ చిత్తమునకు వ్యతిరేకముగా నున్నప్పుడు నా చిత్తమును కొట్టివేసికొందును.

2) దేవా! ఒకచోటికి వెళ్ళుమని నీవు నాతో చెప్పునప్పుడు, నా మనస్సులో ఇష్టము లేకపోయినను మరియు నాకు శక్తి, వీలులేకపోయినను, ఏమియు మాటలాడకుండా అబ్రాహాముచలె వెళ్ళుటకు పూనుకొన్నాను.

3) దేవా! ఒక కష్టమైన పని నీవు నాకు అప్పగించి తప్పకుండా చేయుమని చెప్పినయెడల నాకు దిగులు పుట్టినప్పటికిని, ఇష్టము లేనప్పటికిని ఆ పనిచేయుటకై పూనుకొన్నాను.

4) దేవా! నాకు ఇష్టములేని మనిషితో, నీవు చెప్పే మాటలు అతనికి చెప్పుటకు వెళ్ళుమని నీవు ఆజ్ఞ ఇచ్చిన యెడల, నాలో పిరికితనము పాతుకొని యున్నప్పటికిని అతనితో మాట్లాడుటకు పూనుకొన్నాను.

5) దేవా! మరియొక మనిషియొద్దకు వెళ్ళి, నన్ను గురించి సాక్ష్యమిమ్మని నీవు నాతో చెప్పినయెడల, ఏమి చెప్పవలెనో నాకు తెలియనప్పటికిని నేను వెళ్ళుటకు పూనుకొన్నాను.

6) దేవా! 'అడవి మృగములున్న వనముదాటి అవతలనున్న గ్రామము మధ్యను నిలిచి బోధించుము' అని నీవు చెప్పిన యెడల, నిర్భయముగా వెళ్ళుటకు పూనుకొన్నాను.

7) దేవా! 'అస్సాము దగ్గరనున్న నాగ కొండలలో నివసించుచున్న నరమాంస భక్షకులయొద్దకు వెళ్ళి బోధించుమని' నీవు చెప్పిన యెడల ప్రశ్న వేయకుండా వెళ్ళి, అట్లు చేయుటకు పూనుకొన్నాను. (బలమిస్తే వెళ్ళుదును అని అనను).

8) దేవా! 'భాష ఎరుగని దేశమునకు నిన్ను పంపుదును' అని నీవు నాతో అన్నట్లయిన ఏమియు తిరుగుచెప్పక, వెళ్ళి ప్రసంగించుటకు పూనుకొన్నాను.

9) దేవా! 'ఒక దేశమునకు నీవు సువార్త పనిమీద వెళ్ళుము. అక్కడవారు నిన్ను బళ్ళెములతో పొడిచి చంపివేయుదురు' అని నీవు చెప్పిన

యెడల నేను ముస్తాబై వెళ్ళుటకు పూనుకొన్నాను. (హతసాక్షి కిరీటము వచ్చును).

10) దేవా! "వెళ్ళి ఆ కొండమీద 40 దినములు ఉపవాసము చేయుము" అని నీవు నాతో చెప్పినప్పుడు, అంతకన్న భాగ్యమున్నదా' అని చేయుటకు పూనుకొన్నాను.

11) దేవా! నాకు ప్రియమైన ఒకరు చనిపోవుటకు సిద్ధముగా నున్నప్పుడు, బ్రతికించే ప్రార్థనలు ఎందరు చేసినను, నీవు విననప్పుడు; నేను ఆనందించి స్తుతించుటకు పూనుకొన్నాను.

12) దేవా! నా చేతిలో పైసాయైనను లేనప్పుడు నీవు నన్నుచూచి, రేపు పేదలకు సంతర్పణ చాటించుమని చెప్పిన యెడల, అట్లు చేయుటకు పూనుకొందును.

13) దేవా! అసాధ్యమైన ఏ పని నీవు నాకు చెప్పినను, నేను చేయనని అనకుండుటకు పూనుకొన్నాను.

14) (1) దేవా! యేసుక్రీస్తునందు పురుషుడనియు, స్త్రీ అనియు బేధములేదని నీ వాక్యములో వ్రాయబడియున్నది గనుక ***నాకొక పరిచయ శక్తి దయచేయుము.*** అదేదనగా నాకంటే చిన్నవారైన బాలికలను చెల్లెంద్రుగాను, పెద్దవారైన బాలికలను అక్కలనుగాను, చిన్నవారైన బాలురను తమ్ములనుగాను; పెద్ద బాలురను అన్నలుగాను; పెద్ద స్త్రీలను తల్లులుగాను; పెద్ద పురుషులను తండ్రులుగాను భావించుకొనుటకు పూనుకొన్నాను. అధికారులను, పెద్దలను, గురువులను చూచినప్పుడు గౌరవభావము కలిగించుకొనుటకు పూనుకొన్నాను.

(2) నా తండ్రీ! ఎవరైనా నా తలంపులోనికి వచ్చినప్పుడును, కంటికి కనబడునప్పుడును, **'వారిని దీవించుము'** అని మనస్సులో ఈ చిన్న ఏకపద ప్రార్థన చేయుటకు పూనుకొన్నాను.

(3) దేవా! కష్టస్థితిలో నున్నవారు జ్ఞాపకము వచ్చినప్పుడును, కనబడినప్పుడును, నా మనస్సున జాలిపడుటకు పూనుకొన్నాను.

(4) దేవా! ఎప్పుడైనా ఒకసారి భూగోళముయొక్క పటముచూచి ప్రతి దేశమును గురించియు, ప్రతి లంకను గురించియు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

(5) ఓ దేవా! ఏక దైవారాధనచేయు మతస్థులను గురించియు, యూదా మతస్థులను గురించియు, బౌద్ధ మతస్థులను గురించియు, జైన మతస్థులను గురించియు, పారశీక మతస్థులను గురించియు, నాస్థిక మతస్థులను గురించియు అప్పుడప్పుడు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

(6) దేవా! జీవరాసులను గురించియు, వృక్షాదులను గురించియు, శాపము పొందిన భూమిని గురించియు, ఆకాశమందున్న వాటిని గురించియు అప్పుడప్పుడు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

(7) దేవా! మానవులకు హానిచేయు క్రిములను గురించియు, ఇతర జీవరాసులను గురించియు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

(8) దేవా! నీవు కలుగజేసిన సమస్తమును దీవించుమని ప్రార్థించుటకు పూనుకొన్నాను.

(9) నేను మరచిపోయి ప్రార్థింపని అంశములను గురించి నీ సన్నిధిలో పెట్టుటకు పూనుకొన్నాను.

(10) దేవా! మానవుల ఉపయోగార్థమై నరులు కల్పించిన వాటిని అనగా పాఠశాలలను, వైద్యశాలలను, చేతిపనుల శాలలను, అన్ని వృత్తులను, అన్ని ఉపయోగకరమైన వస్తువులను గురించియు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

15) దేవా! కొన్ని మనవులు చేయుచున్నాను;

1. "క్రైస్తవ సంఘమా – ఘనకార్యములు చేయు – కాలము వచ్చెను" అను కీర్తనలోని సంగతులు త్వరగా నెరవేర్చుదువని నమ్ముచున్నాను.

2. "పరమ దేవుండే – నా పక్షమైయుండగా" అను కీర్తనలోని సంగతి నెరవేర్చుదువని నమ్ముచున్నాను.

3. "మనో విచారము కూడదు నీకు" అను కీర్తనలోని సంగతులు త్వరగా నెరవేర్చుదువని నమ్ముచున్నాను.

4. "యేసు నామస్మరణ చేయండి" అను కీర్తన ఇంకా ఎక్కువగా దీవించుదువని నమ్ముచున్నాను.

# 3. ఆదివారమున చేయు స్తుతులు

1. దేవా! నీవు మొదటి దినమున వెలుగు కలుగజేసినావు. కడపటి దినమగు ఏడవ దినము సృష్టి పని ముగించినావు. ఏడవదినము శనివారము అని బైబిలు చరిత్రవలన తెలియుచున్నది. అలాగైతే మొదటి దినము అనగా 'వెలుగు కలుగునుగాక' అని నీవు చెప్పిన రోజు ఆదివారమై యుండవలెను. లోకముయొక్క చరిత్రలోనికి మొదట వచ్చిన దినము ఆదివారము. ఆ దినము వెలుగు దినము కాబట్టి నీకు స్తోత్రములు.

2. వెలుగు దినమైన ఆదివారము, క్రైస్తవులమైన మాకు ఆరాధన దినముగా వాడుకొననిచ్చినావు గనుక మా ఆరాధన దినము వెలుగు దినము. కాబట్టి నీకు వందనములు.

3. యేసుప్రభువు వచ్చి పరలోకమునకు వెళ్లేవరకు, ఏడవ దినమే అనగా సబ్బాతు దినమే విశ్రాంతి దినముగ ఆచరింపబడెను. గనుక నీకు స్తుతులు.

4. యేసుప్రభువా! నీ శిష్యులకు శనివారము దుఃఖదినము. అది వారికి చీకటి దినము. వెలుగు దినముకాదు. ఎందుకనగా వారికి రక్షకుడవైన నీవు (absent) లేవు. నీవు సమాధిలో ఉన్నావు. అయ్యో! యేసుప్రభువు మనలను ఎంతో ఉద్ధరిస్తారనుకొన్నాము గాని శత్రువులు చంపిన చంపనిచ్చినాడు. ఇక మన గతి ఏమిటని నిరాశలో దిగిపోయినారు. గనుక శనివారము మరింత దుఃఖదినము, అమావాస్య చీకటి దినము, అందరును చెదిరిపోయిన దినము. సంఘము కూడుకొనలేదు. యేసుప్రభువా! నీకు చావు ఎట్లు రానిచ్చినావో, అట్లే నీ శిష్యులకు దుఃఖదినముకూడా రానిచ్చినావు. ఇది వారిని వెలుగు దినమునకు సిద్ధపర్చుటకై ఏర్పరచిన దినము. కష్టము తరువాత కష్టనివారణ కలుగును. దుఃఖము తరువాత సంతోషము కలుగును. ఇది లోకములోనున్న చరిత్ర గనుక నీకు మంగళ స్తోత్రములు.

5. యేసుప్రభువా! మార్కు 16 అ॥లో వ్రాయబడియున్నట్లు, నీవు ఆదివారమున బయటకు వచ్చినావు. అప్పుడు నీ వెలుగు వలన కావలివారు మూర్చిల్లిపోయిరి. ఆ మొదటి దినము సృష్టి వెలుగు దినము. అలాగు ఈ

దినము, ఈ పునరుత్థాన దినము కూడా వెలుగు దినము. గనుక నీకు స్తోత్రములు.

6. అప్పటినుండి శిష్యులు నీకు నమస్కరించిరి. ఆదివారము నిన్ను స్తుతించిరి. ఆ నమస్కారము సంఘములో నేటివరకు నున్నది. ఆదివారము గుడికి వెళ్ళుట నీకు నమస్కారము చేయుటకే. అదే నీకు స్తుతి. ఆదివారము స్తుతిదినము గనుక 52 ఆదివారములు, మేము నీ పునరుత్థానమును జ్ఞాపకమునకు తెచ్చుకొనవలయును. ఒక ఈస్టరు పండుగ దినముననే కాదు గనుక నీకు స్తుతులు.

7. యేసుప్రభువా! నీ శిష్యులు ఆదివారమున కూడుకొనినప్పుడెల్లా వారి మీటింగులలోనికి నీవు వెళ్ళి, వారితో సహవాసమునందు పాల్గొన్నావు. కాబట్టి క్రైస్తవులమైన మేము ఆదివారము ఆరాధన పెట్టుకొనుట నీకిష్టమే గనుక అనేక నమస్కారములు.

8. ఓ శిష్యులారా నాలుగువేల సం॥లనుండి ఆచరించుచున్నారు. శనివారము మానివేసి ఎందుకు ఆదివారము ఆరాధన పెట్టుకున్నారు? అని నీవు గద్దింపలేదు. గనుక శనివారము ఆచరింపక పోవడము నీకు ఇష్టము గనుక నీకు ప్రణుతులు.

9. నాలుగువేల ఏండ్ల పాపము ఏలినందుకు భూమి చీకటియాయెను. మరల నీ పునరుత్థానమునుబట్టి క్రొత్త సృష్టి కలిగినది. అది కాకుండ నీ నామమున ఎవరెవరు బాప్తిస్మము పొందుదురో, అప్పుడు వారు నీ యొక్క నూతన సృష్టియై యుందురు. వారికాదినము వెలుగు దినము గనుక నీకు వందనములు.

10. పాపి మారుమనస్సు పొందినప్పుడు అది అతనికి వెలుగు దినము. అది ఆదివారము వంటిదే గాని శనివారము వంటిదికాదు గనుక నీకు స్తుతులు.

11. అపోస్తలుడైన పౌలు వ్రాసినట్లు మేము పునరుత్థాన బలము పొందవలెను. సాతానును, దయ్యములను, పాపములను, పాప ఫలితములగు మరణమును జయించుటకు నీ పునరుత్థాన బలము చూపించినావు. ఆ వేళ కావలివారు ఎట్లు పడిపోయినారో, అట్లే పాపములు చేయించు దయ్యములన్నియు పడిపోయినవి, శత్రువులు పడిపోయినారు. నీ కాంతికి ఎవరు నిలువగలరు! నీ శక్తి ఎదుట ఎవరు నిలువగలరు! లొంగకుండ ఎవరు ఉందురు? మరణమునకు గతిలేదు. ఇంక ఎవరికి గతియుండును! ***అంత గొప్ప బలము నేడు అనగా ప్రతి ఆదివారము దయచేయుదువు.*** కాబట్టి నీకు స్తోత్రములు.

12. ఆదివారము ఉదయమునుండి సాయంకాలము, రాత్రి వరకు స్తుతి చేయవలెను. బజారుకు వెళ్ళుట మా పనికాదు. లోక సంబంధమైన పనిచేయుట మా పనికాదు. దుఃఖము పెట్టుకొనుట మా పనికాదు. యేసుప్రభువా! నీ పునరుత్థాన చరిత్ర, నీ పునరుత్థాన బలము, నీ పునరుత్థాన వెలుగు తలంచుకొనకుండుట మా పనికాదు. మేమట్లు చేసినయెడల నీవు మమ్ములను క్షమించుము. ***నిజమైన పట్టుదలగల ఉపవాసపరులకు ఆ వేళ ఉపవాసమే,*** ఆనంద ఉపవాసమే. తెలియని ఆహారముగల దినమే. ఆకలి తీరే దినమే. ఇంతగొప్ప దినమును క్రైస్తవసంఘము నిర్లక్ష్యము చేయుచున్నది. ఈరోజు అంతా గుడిలో లేక ఇంటివద్ద, ఈ రెండు స్థలములలో మేము

ఉపవాస కార్యక్రమము ఆచరింపగలిగితే మాకు వేలకొలది నోట్సులు చెప్పగలవు. గాని అవి ఎవరికి కావాలి? గుడిలో పాదిరిగారు బోధించే దానికంటే నీవు ఉపవాస స్థలములోనే ఎక్కువ బోధిస్తావు. కాబట్టి నీకు స్తోత్రములు. అయినను మేము గుడికివెళ్ళి ఏర్పాటు ప్రకారము ఏకీభవించవలెను. అప్పుడు మమ్మును పాతాళలోక శక్తులు ఏమియు చేయనేరవు గనుక నీకు నిత్య స్తోత్రములు.

13. ఓ ప్రభువా! మేము పరలోకమునకు వచ్చినప్పుడు ఆరు రోజులు ఇక్కడ ఉండిపోవును. ఒక్క ఆదివారమే అక్కడకు వచ్చును. అక్కడ అంతా పగలే, అంతా వెలుగే, అంతా పునరుత్థాన బలమే, అంతా నీవే, శాశ్వతము వరకు అంతా ఆదివారమే, అంతా ఆరాధనే, అంతా విశ్రాంతియే, అంతా సహవాసమే. ఆ మహాభాగ్యము పొందకముందే, ఇక్కడ ఆదివార భాగ్యము అలవాటు చేసికొను కృప దయచేయుము. నీకే ఘన వందనములు.

14. ఆదివారము ఆదిరోజు. మా జీవితకాలమంతయు విశ్వాసమును కలిగియున్నయెడల సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శనివారములు ఆదివారములే. సంవత్సరములన్నియు ఆదివార సంవత్సరములే. గనుక మా తలలోనుండి, మా హృదయములోనుండి, మా బ్రతుకులోనుండి ఆదివారమును ఎప్పుడు తీసివేయకూడదు. ఆ దినము విజయమునకు సూచన దినము గనుక నీకు స్తోత్రములు. అక్కడ ఇక్కడ స్తోత్రములు.

15. క్రైస్తవులు ఆదివారమునాడు తమయొక్క అవసరములనుబట్టి చిన్న చిన్న పనులు చేసికొనుచున్నప్పుడు ప్రభువు ఊరుకొనుచున్నారు.

సబ్బాతు దినమున యూదులు పనిచేస్తే, మోషే ధర్మశాస్త్రము వారికి శిక్ష విధించెను. అలాగే యేసుప్రభువుకూడ మనలను ప్రతి ఆదివారము శిక్షించిన మతములోనికి ఎవ్వరును రారు. అయితే ధర్మశాస్త్ర ఆజ్ఞ శనివారము గతించిపోయినట్లుగా గతించిపోగా ఆదివారము వచ్చినది. అచ్చటినుండి కృపాశాస్త్రము ఆరంభమైనది. యోహాను 1:18. కృపాశాస్త్ర ప్రకారము, మనిషి తన అనుకూలతనుబట్టి నడుచుకొన వచ్చును. ఆ అనుకూలమైనది క్రైస్తవమతముయొక్క ప్రేమ నిర్ణయమై యుండవలెను. గనుక నీకు వందనములు.

16. ఎ) త్రిత్వము ఆదివారమున వెలుగు కలుగునుగాక! అని చెప్పెను. అది తండ్రియొక్క పనిదినమై యున్నది. బి) పునరుత్థానము ఆదివారమున జరిగెను. అది కుమారుడైన దేవుని పనిదినమై యున్నది. సి) పెంతెకొస్తు ఆదివారమున జరిగెను. అది పరిశుద్ధాత్మ పనిదినమై యున్నది. ఈ మూడు దినములు ఆదివారములే. తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు మూడు పని దినములు మనకు జ్ఞాపకమునకు వచ్చు దినము ఆదివారము. ఇంతకంటే ఆనందకరమైన రోజు ఏది? గనుక నీకు నిత్య మంగళ స్తుతులు. ఆమేన్.

## 4. స్విచ్ ప్రార్థన (బంధింపు ప్రార్థన)

యేసుప్రభువా! ఈ వేళ లేచిన వెంటనే స్విచ్ ప్రార్థన చేయుచున్నాము (మత్తయి 18:18).

మనము చేయవలసిన ప్రార్థనలు అన్నియు చేసి ముగింపవలెను. స్విచ్ఛ్ మనము వేయగానే వెలుగురాదు. అయినప్పటికిని మరియొక మారు నొక్కముగాని, వెలుగు వచ్చువరకు కనిపెట్టుదుము. రెండవరాకడ సమీపమందున్న మనము మరొక మారు నొక్కుట అవసరములేదు. గనుక చేయవలసిన ప్రార్థనలు త్వరగా కాలానుసారముగా చేసి కనిపెట్టవలెను. అప్పుడు ఇశ్రాయేలీయులు, ఎఱ్ఱ సముద్రమువద్ద తమ శత్రువులవలన కలుగవలసిన బాధనుండి విమోచితులైన రీతిగానే, మనమును విమోచితులమగుదుము. భూమిమీద మనము బంధించువాటిని పరలోకమందు ప్రభువు బంధించును. మనము వేటిని విప్పుదుమో వాటిని ప్రభువు పరలోకమందును విప్పును. మన ఇష్టము ఈ రెండు వాక్యములలో (పంక్తులలో) కనబడుచున్నది. మన స్వాతంత్ర్యమునుబట్టి మన చిత్తమే కనబడుచున్నది. ఇది ఎంత ధన్యత! అనేకమంది భక్తులే ఈ ధన్యతను పోగొట్టుకొనుచున్నారు. ***పరలోకమందు వెలుగు ఉన్నట్లు భూలోకమందు స్విచ్ అనగా మన ప్రార్థన ఉండును. అనగా మన ప్రార్థనగదిలో ప్రార్థన వెలుగువలె నుండును.***

# 5. ప్రత్యేకమైన ప్రార్థన (మత్తయి 6:6)

మనకు తెలిసిన వాక్యములు సందర్భానుసారముగా చదువుకొనిన యెడల, క్రొత్త వెలుగు దానిలోనుండి బయటకు వచ్చును.

1. త్రియేక దేవుడవైన తండ్రీ! విపత్తు కాలములో మేము నీకు ఒక మనవి చేయుటకై సంతోషముతో వచ్చియున్నాము. విచారము, భయము,

స్వేచ్ఛలేనితనము ఉండవలసిన సమయమిదే. అయినను మీ వాక్య వాగ్దానమునుబట్టి సంతోషము, ధైర్యము, స్వేచ్ఛ, సేవలో తీవ్రత కలిగియుండవలసిన సమయముకూడ ఇదే. మొదటి శతాబ్దములో ఈ సంఘమును వ్రేళ్ళతోపాటు నాశనము చేయవలెనని ఉద్దేశించిన, సర్వభూగోళ చక్రవర్తులైన రోమా దేశీయులు ఏమియు చేయలేకపోయిరి. అందుచేత నీ సంఘము ఒక నదివలె ఇరువది శతాబ్దముల వరకు, మా యొద్దకు ప్రవహించుచు వచ్చినది. ఇది నీ ప్రభావము గనుక నీకు స్తోత్రములు.

2. నేడు మా కాలములో, మా దేశములో, నీ సంఘముయొక్క మేళ్ళు అనేక విధములుగా అనుభవించుచున్న అనేకులు, నీ సంఘమును వృద్ధికాకుండ చేయవలెననియు; క్రైస్తవులు, హిందూ దేశ మతములోనికి మరలా రావలెననియు; దేశీయమతము యుండగా పరదేశమతము ఎందుకని వాదించుచున్నారు. మరియు బైబిలులో కాని సంగతులు అనేకములున్నవని ద్వేషభావముతో పలుకుచున్నారు. పత్రికలు వేయుచున్నారు. గ్రంధములు ప్రచురించుచున్నారు. గనుక దేవా! వారి ఆలోచనలను బంధించుము. వారి మాటలను, ఉపన్యాసములను బంధించుము. వారి పత్రికాదులను బంధించుము. వారి ఇతర ప్రయత్నములను బంధించుము. అనగా హానిచేయు ప్రయత్నములను బంధించుము. కాని ముందుగా మేము, మా ప్రార్ధన గదిలో వాటిని బంధింపగల చురుకుతనము దయచేయుము. భయమును, అపనమ్మకమును మాలోనుండి తీసివేయుము. అప్పుడు మేము బంధింపగలము.

3. ఇశ్రాయేలీయులయొక్క శత్రువులను చెలరేగనిచ్చినట్లుగా, మా శత్రువులను చెలరేగనిచ్చుట అనగా వారు చెలరేగుచుండగా, నీవు

ఊరకుండుట ఎందుకనగా మా చేత ప్రార్ధనలు చేయించుటకే; మా చేత ఎక్కువ సేవ బహు తీవ్రముగా కొనసాగించుటకే. అందుకే నీవు మౌనముగా నున్నావు గనుక నీకు వందనములు.

4. వారు ఏయే ప్రయత్నములు చేయుచున్నారో, ఆయా ప్రయత్నములకు మించిపోవు ప్రయత్నములు, మేము సదుద్దేశ్యముతో చేయులాగున, మాకు శాంత మనస్సును, జ్ఞానోదయమును అనుగ్రహింపుము.

5. మరియు వారు వారి దేవతలను ప్రార్థించుచుండగా మేము నిన్ను ప్రార్థించుచున్నాము. వారు (దుర్భోధన) ప్రచారము చేయుచుండగా, మేముకూడ సద్భోధ ప్రచారము చేయునట్లు, మా నోళ్ళకు, మోకాళ్ళకు సత్తువ దయచేయుము. వారు బాహాటమైన సభలలో గంభీరమగు దూషణోపన్యాసములు చేయుచుండగా మేము– 'నిన్ను అడుగు ప్రతివానికి సమాధానము చెప్పుము' అను వాక్య ప్రకారము, వారికి న్యాయమైన రీతిని నచ్చచెప్పగల ఉపన్యాసములు చేయుటకు, మా గుండెకు సత్తువ; మా జ్ఞానమునకు శక్తి, సమాధానము చెప్పగల వాక్యములను మా జ్ఞప్తికి అందించుము. ఎందుకనిన 'మీరు కాదు, వారికి ఏమి జవాబు చెప్పవలెనో, అది ఆత్మయే మీకు అందించును' అని వ్రాయించినావుగదా! (మత్తయి 10:19,20). గనుక మాకు నీ ఆత్మ సహాయము చూపించుము. దర్శనవరముగలవారికి ప్రత్యక్షమగుము. వారి పత్రికలకు, పుస్తకములకు తగిన జవాబు వ్రాయుటకై మా హస్తములకు చాకచక్యము, వాటిని అచ్చువేయించుటకు కావలసిన ధనరాశిని సమకూర్చుము. వారు

కుట్రాలోచన చేయుచుండగా మేము మంచి ఆలోచనలు చేయుటకై మంచి ఆలోచనను మాలో పుట్టించుము.

6. మా ప్రభువా! నీవు సిలువ మ్రానుమీద నున్నప్పుడు 'తండ్రీ! వీరు ఏమి చేయుచున్నారో వీరికి తెలియదు గనుక వీరిని క్షమించుము' అని ప్రార్థించిన విధముగా మేముకూడ ప్రార్థించునట్లు మమ్మును క్షమాపణ స్థితికి నడిపింపుము. మరియు తండ్రీ వారినికాదు, వారియొక్క దుష్ట ప్రయత్నములను దుంపనాశనము చేయుము. ఈ సమయమందే చైనాలో జరిగినట్లు, మా దేశస్థులుకూడ బైబిలుకొరకు బైబిలు సొసైటీ వారికి వ్రాసికొనునట్లు ప్రేరేపించుము. ***ప్రజలందరు మాకు క్రైస్తవ బోధలు, క్రైస్తవ పత్రికలు, పుస్తకములు కావలెనని కేకవేయగల ఆర్భాటశక్తి ప్రజలలో కల్గించుము.***

7. ఓ దేవా! అంతములేని కృపగల దేవా! నీకు స్తోత్రములు. సాతాను తనకు ఎక్కువ సమయములేదని చెలరేగి విశ్వాసులమీద పడుచున్నాడు. అతని ఆలోచనలు సాగనీయకుము. అతని ప్రయత్నములు నెరవేరనీయకుము. అతని పన్నాగములను చెడగొట్టుము. అలాగుననే ఇప్పుడును లోకమంతట తిరిగే భూతములను వాటియొక్క పనులను నీవు బంధించుము. ఆమేన్.

షరా:- 1) మన దృష్టిలో ఎవరైనా బంధింపబడిన వారున్నయెడల వారిని తలంచుకొని ఈ పైన వ్రాసిన విధముగా ప్రార్థించవలెను. 2) సాతాను ఎదిరింపుల పుస్తకము 6వ పేజిలో 11వ ఎదిరింపును చూడండి.

# 6. మిశ్రమ ప్రార్ధనాళము

**1. ప్రార్థన:–** ఓ దయగల తండ్రీ! నీవు ప్రార్ధనలు వినువాడవగుటవలన, నీ సన్నిధికి వచ్చి ఏదైన చెప్పుకొనవచ్చుననియు, అడుగుకొనవచ్చుననియు తెలిసి నిన్ను స్తుతించుచున్నాను. నాకు కావలసినవి నీకు ముందుగానే తెలిసినను, అడుగుడి మీకియ్యబడునని చెప్పినావు గాన నా మనవులన్నియు నీ యెదుట సమర్పించుకొనుచున్నాము.

ఓ తండ్రీ! నాకు ఏమియ్యవలెనని నీకు ఉన్నదో అదే దయచేయుము. నేను ఎల్లప్పుడు నీ సన్నిధిలో స్వేచ్ఛగా సంచరింపగల బిడ్డనుగా నన్ను స్థిరపరచుచుండుము. కష్టకాలములోను, సంగతులు అర్ధముకాని కాలములోను నేను నీ పక్షముగా నిలువబడగల ధైర్యము దయచేయుము. నిన్నుగూర్చి నాకుగల మంచి అభిప్రాయమును మారనీయకుము. పాపమునుండియు, పాపఫలితము నుండియు నన్ను కాపాడుచుండుము. ప్రతి పర్యాయము నీ వాక్యమును నాకు బోధపరచుచుండుము. నా ఆత్మతో సదా మాట్లాడుచుండుము. మరియు నీ విషయమై కృతజ్ఞతతో, కష్టపడి పనిచేయగల సేవకునిగా నన్ను స్థిరపరచుచుండుము. నన్ను పెండ్లికుమార్తె వంశమునుండి విడిపోనీయకుము. నీకిష్టములేనివి నేను అడుగతలచినప్పుడు అవి ప్రార్ధనా వాలులోనికి రాకుండా తప్పించుము. మరియు ఒక అంశమును గురించి ప్రార్థింపవలసిన గడియ దాటిపోనీయకుము. నాకు ప్రార్ధన వాలు దయచేయుము. సర్వజనులకు నీవాక్యవార్త అందింపగల బోధకులను పంపుము. వాక్యముపదేశించు ఏర్పాటులన్నిటిని వృద్ధిచేయుము. పాపులకు,

బాధితులకు, బీదలకు అన్యాయము పొందుచున్నవారికి తోడైయుండి, వారి పక్షమున జరుగవలసిన సర్వకార్యములను వృద్ధిచేయుము. ఈ ప్రార్థన నీ కుమారుని ముఖముచూచి ఆలకించుము. ఆమేన్.

**2. సమర్పణ:-** ఓ దేవా! నీవు నాకు ఇచ్చినవన్నియు నీకు సమర్పించుచున్నాను. నా శరీరమును, నా ఆత్మను, నాకు కలిగియున్న సమస్తమును, నా జీవితకాలములోని గతకాలమును, నేటి కాలమును, రాబోవుచున్న కాలమును నీకు అర్పించుచున్నాను. నీ చిత్తము ఏదో అదే నా చిత్తమైయున్నది. నీ చిత్తము అనేకమారులు నాకు ఇష్టముగా నుండకపోయినను, నేనది ఇష్టపడునట్లు సహాయపడగోరుచున్నాను. ఏది నేను చేయలేకపోవుచున్నానో దానిని, నా బంధువులను, స్నేహితులను, అధికారులను నేనంటే ఇష్టములేని వారిని మరియు శత్రువులను, నీకప్పగించుచున్నాను. మమ్మును బాధపెట్టు పురుగులు, జంతువులు, పక్షులు మొదలైన వాటిని నీకు సమర్పించుచున్నాను. అలాగే మాకు బాధాకరముగా నున్న దయ్యములను, సాతానును, తత్ సంబంధమైన వాటినన్నిటిని నీవశము చేసికొనుము. మాకు హానికరముగానున్న పంచభూతములను నీకు అర్పించుచున్నాను. ఈ అర్పణ నీ కుమారుని పరిముఖముగా చూచి అంగీకరించుము. ఆమేన్.

**3. రాకడ ప్రార్థన:-** ఒక గ్రామములో అందరు కలహములతో నుండిరి. ఒక దినమున తన జ్వరముగానున్న కుమార్తెను చూడవచ్చిన తండ్రి, భయంకరమైన కలహముల సంగతి విని, తన కుమార్తెను తన ఇంటికి తీసికొనిపోయెను. ఈ లోకము గత్తరలోకము, వ్యాధుల లోకము,

విషపురుగుల లోకము, మరణలోకము, దయ్యాల లోకము, దయ్యాలకు లోబడిన మనుష్యులున్న లోకము కాబట్టి మన తండ్రియైన దేవుడు మనలను ఇచ్చటనుండకుండ మోక్షమందిరమునకు తీసికొనివెళ్ళును. ఆయన శీఘ్రముగా వచ్చును. ఇదే రెండవరాకడ. తండ్రి తన కుమార్తెను తీసికొని వెళ్ళునప్పుడు 'రాను' అని చెప్పదు. మనముకూడ మేఘములోనికి 'రాము' అని చెప్పకూడదు. ప్రభువా! తండ్రి! సిద్ధముగానున్నాను అని చెప్పవలెను. ఓ ప్రభువా! మేమట్లు చెప్పగల కృప దయచేయుము. ఆమేన్.

# 7. మీ శరీరములను సమర్పించుకొనుడి

అన్యులు శరీరమునకు ప్రాముఖ్యమిత్తురు. ఆత్మకు శరీరము పంజరము వంటిది. క్రైస్తవులు శరీరమునకు ప్రాముఖ్యమీయరు. ఈ శరీరమును ఎవరిచ్చారు? (రోమా 11:36). ఇది ప్రభువు మూలమున ప్రభువు నిమిత్తము కల్గినది. హెబ్రీ. 10:5లో నాకొక శరీరము అమర్చితివి. ఆది 1:27లో దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. 1కొరింథీ 6:19-20. మీ దేహము దేవుని వలన మీకనుగ్రహింపబడి పరిశుద్ధాత్మకు ఆలయమైయున్నది గనుక ఇష్టము వచ్చినట్లు చేయవచ్చా? దయతో ఇచ్చిన దేవుని ఆలయమును ఎవడైన పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడుచేయును.

Iకొరింథీ. 3:17. దేహము దేవుడిచ్చినదానము. అది పరిశుద్ధమైనది. దేహములో పరిశుద్ధాత్మ ఉన్నాడు. మీరు విలువబెట్టి కొనబడినవారు 1కొరింథీ 7:23. వెండి బంగారములతో కొనబడలేదు గాని అమూల్యమైన రక్తముచేత కొనబడినారు. నిష్కళంకమైన గొర్రెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత కొనబడినారు.

1పేతురు 1:18-20. గనుక తరతరముల వ్యర్థ ప్రవర్తనను విడిచిపెట్టుడి. 60సం॥ల నాటి కథ. రాజమండ్రిలో ఊలు దొరగారు ఉండెడివారు. ఆయనకు ఋషి అని పేరు పెట్టినారు. ఆయన హాస్టల్లో ఒక కుర్రాడు, దొంగతనము చేస్తే ఆ కుర్రవాడ్ని దొరగారి దగ్గరకు తీసికొనివస్తే మీనాయన దొంగ, గనుక నీవు దొంగవైనావు అని అన్నారు. నీ తాతల దగ్గరనుండి దొంగతనము నీకు వచ్చినది. పెండ్లిండ్లు కావాలంటే పురోహితుని దగ్గరకు వెళ్ళుదురు. నీవెంత చదివిన లాభమేమి? తల్లిదండ్రుల దగ్గరనుండి వచ్చిన దురలవాటు పోలేదు. వేషము మారినదా? భాష మారినదా? మూల్యము అంటే ధర. అమూల్యము అంటే ధర కట్టలేనంత విలువపెట్టి నీ దేహము కొనబడినది. ఒక కుర్రవాడు గలడు. అతని తండ్రికి అతను ఒక్కడే అని బాగా పెంచుచున్నారు. ఆ పిల్లవాడు తోటలోకివెళ్ళి చెట్టు నరికి చిన్న పడవ చేసినాడు. దానిని వాగులో పడవేసినాడు. రెండు క్షణములలో కొట్టుకొని పోయినది. ఎంతో దుఃఖపడ్డాడు. ఆరు రోజులకు సంతలోనికి వెళ్ళినాడు. బజారులో ఒకని దగ్గర ఆ పడవ యున్నది. అపుడు అతడు దానిని చూచి నాది అంటే ఇస్తాడా? ఇవ్వడు గనుక అప్పుడు అతడు తన తండ్రి దగ్గరకు వెళ్ళి డబ్బు తెచ్చి కొనుకొన్నాడు. యేసుప్రభువు నీ కొరకు నాకొరకు చేసిన పని ఏమిటి? దేవుని స్వరూపమందు మనుష్యుని చేసినాడు. కాని మానవుడు చెడిపోయినాడు. ప్రభువు తన రక్తము కార్చి సిలువవేయబడి, మనల్ని కొనుక్కొన్నాడు. చనిపోయి, లేచినాడు. అట్లు బ్రతికిన మీరు బలి అవండి. పౌలు- నేను ప్రభువుతో సిలువవేయబడ్డాను, ప్రభువే నాయందు జీవించుచున్నాడు. నేనుకాదు. ఇది క్రైస్తవ రహస్యము, ఆనందము. II కొరింథీ. 9:2. మాసిదోనియ సంఘముయొక్క ఆసక్తిని గుర్తించండి. కాడి, బలిపీఠము

ఎద్దువలె కాడిమోయాలి. అవసరమైతే బలికావాలి. అదే క్రైస్తవ జీవితము. నేను ఏ కార్యము చేసిన క్రీస్తు కొరకే చేస్తాను అనాలి. అర్పణ అంటే కష్టము. చిన్న నాణెము వేస్తాము. కాని దశమ భాగము ఇవ్వాలి. వారికి ఉద్యోగముండదని బావమరిదికో, బంధువులకో ఇస్తారు. ఇస్తున్నామంటే ఇస్తున్నాము. దేవునికి నీ అర్పణ చాలా అవసరము. ఒక ప్రయాణికుడు వెళ్తున్నాడు. ఒక ఊరు వెళ్ళునప్పుడు చీకటి పడి సత్రములోకి వెళ్ళినాడు. మీసాలు పెట్టుకొని ఒక వ్యక్తి సామాను పట్టుకొని కనపడ్డాడు. గుండె జల్లుమంది. వీడేమి చేయునని కీర్తనపాడాడు. వాడే రైటు పాడాడు. ఇతగాడు తప్పు పాడాడు. ప్రార్థన చేస్తానని మోకాళ్ళమీద ప్రార్థన చేస్తున్నాడు. వాడును చేస్తున్నాడు మరునాడు ఇతడు గుడిలో కాను తీసి చందా వేస్తున్నాడు, వాడు కానుక దగ్గరకు రాగా పారిపోయాడు. 1) పరిశుద్ధముగా ఉండాలి, 2) అనుకూలముగా ఉండాలి, 3) సజీవయాగము చేయాలి. సువార్త అను యాగము, హెబ్రీ. 10:23. వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు. గనుక మన నిరీక్షణ విషయమై మనము ఒప్పుకొనినది నిశ్చయముగా పట్టుకొందాము. II కొరింథీ. 12:15. చందా ఇస్తున్నాను. అది ఇస్తున్నాను. ఇది ఇస్తున్నాను. స్పర్జను అను భక్తుడు 'నీవు బాప్తిస్మము పొందినప్పుడే నీ ధనముకూడ బాప్తిస్మము పొందినది అనెను'.

II కొరింథీ. 8:4-5. మక్కువ కలిగినవారు సామర్థ్యము కొలదియేకాక సామర్థ్యముకంటే ఎక్కువగాను తమంతట తామే ఇచ్చిరి. దేవుని చిత్తము వలన మాకును, తమ్మును తామే అప్పగించుకొనిరి. ఆమేన్.

# 8. సమర్పణ ప్రార్ధనా ప్రసంగము

(ఇది సమర్పణ ప్రసంగము చేయునప్పుడు ఉపయోగముగా నుండును).

**సమర్పణ:-** శరీరము, ఆత్మ, జీవమును ఇంకను మనకు కలిగియున్నది సమర్పించవలయును.

**ప్రార్ధనమెట్లు:-** సేవ, పరిచర్య, సమర్పణ చేయవలెను.

1) సమర్పణ అనగా నాకు కలిగియున్న యావత్తు నీ స్వాధీనము చేస్తున్నాను. 2) నాకు కలిగియున్నది నా ఇష్టమునుబట్టి వాడుకొనను. నీ ఇష్టమునుబట్టి వాడుకొందును. 3) నేను ఈ ప్రకారము చేసేటప్పుడు నాకు ఆటంకములు వచ్చును. ఆటంకములు, ఆపదలు వచ్చినా నీ చిత్త ప్రకారము చేస్తాను.

షరా:- మొదటి రెండు సుఖముగానున్నప్పుడు చేసిన తీర్మానములు. (1) ఆపదను బట్టి బాటసారి మంచి సమరయుడు చేసినదానంతటిని సమ్మతించును. గాయముకట్టనిచ్చెను. వాహనముమీద ఎక్కించునప్పుడు ఊరుకొనెను. పూటకూళ్ళవాని కప్పగించినప్పుడు ఊరుకొనెను. అదంతా చేయనిచ్చెను. ఆ విధముగానే మన విషయమై ప్రభువు ఏమి చేసినా ఊరుకొన్న యెడల ఆయన ఎంత ఉపకారమైన చేయును. (2) వారు నీ మాట వినరు. అయినప్పటికిని నీవు వెళ్ళి చెప్పవలెను అని దేవుడు యెహెజ్కేలుతో పలికెను. యెహెజ్కేలు దేవుని చిత్తమునకు సమర్పణ అయినాడు గనుక ఎదురు మాట చెప్పలేదు. వెళ్ళి వారికి బోధించినాడు. వినేవారలారా! మిమ్మును దేవుడు

అటువంటి సువార్త అక్కరలేని స్థలమునకు పంపిస్తే వెళ్ళుదురా? (3) మీ సహోదరుని మీద నీకెప్పుడైన కష్టముంటే సమాధానపడు, అప్పుడు నీ దేవుని బలి పీఠమునొద్దకు రమ్ము అని ప్రభువు ఉపన్యాసములో సెలవిచ్చెను. ఇది కష్టమైన పని. చందావేయుట సుళువైన పనేగాని సమాధానపడుట సుళువైనపనియా? దేవుని వాక్యమిచ్చే సలహాకు సమర్పణ అయినవారు దేవుని వాక్యములో ఉన్నట్లు చెప్తారు. వారాలాగు చేయగలరా? (4) గార్ధభమును పేతురు, యోహానులు విప్పి తీసికొనివచ్చిరి. ప్రభువు చెప్పిన పని చేసినారు. 'మీరు ఫలాని చోటికి వెళ్ళి పలానా పని చేసిరండి' అని ప్రభువు మీతో తన వాక్యము ద్వారా చెప్పిన యెడల మీరు చేస్తారా? (5) ఆయన కోరినట్లు వారు చేసిరి. ప్రభువు యొక్క కోరికకు సమర్పణ అయినవారు తప్పక చేస్తారు. (6) 5వేల మందికి ఆహారము పెట్టకముందు శిష్యులు ప్రజలను బారులు తీరి కూర్చుండబెట్టవలసిందని ప్రభువు చెప్పెను. ఆ ప్రకారమే వారు చేసిరి. ఇందరకు సరిపోయే రొట్టెలు లేవు గనుక వచ్చిన తరువాత కూర్చుండబెట్టకూడదా? అని వారు ఎదురు చెప్పలేదు. చెప్పినట్లు చేసారు. అలాగే మీరును చేయగలరా? (7) ఒక స్త్రీ తనకున్నది యావత్తు చందా వేసెను. ఇది యూదుల నిబంధనలోని ప్రధమభాగము కంటే ఎక్కువ. అంతా వేయుమని ప్రభువు చెప్పకపోయినను వేసినది. ప్రభువు చెప్పకపోయినను మీ మనస్సాక్షికి తోచిన ఒక మంచి కార్యము మీరు చేయగలరా? చెప్పినదే చేయలేక పోవుచున్నాము. చెప్పనిది ఏ మాత్రము చేయగలమా? (8) పేతురు నీటిమీద నడువవలసిందని యేసుప్రభువు చెప్పెను. మునిగిపోవుదుననే భయము లేక పోయెను. ప్రభువు ఇచ్చిన

సెలవు ప్రకారము చేయ ప్రయత్నించెను. తాను ప్రభువుయొక్క సమర్పణకు సమర్పణ ఆయెను. అందుచేత కొంతదూరమైన నడువగలిగెను. అసాధ్యమైన పనిని ప్రభువు చెప్పితే చేయ ప్రయత్నించెను. గాని భీతివలన పడిపోయెను. రక్షింపబడినందువలన మరలా ప్రయత్నించెను. ప్రభువు మనకు అసాధ్యమైన పని చెప్పినప్పుడు మనము చేయగలమా? (9) ప్రభువు ఒకనిని చూచి నన్ను వెంబడించుమని చెప్పెను. అతని దృష్టి తండ్రి సమాధి చేయుట మీదనున్నది. మన ఇష్టము ఒక అంశముమీద ఉన్నప్పుడును, ప్రభువుమీద నున్నప్పుడును, ప్రభువు వద్దని చెప్పితే ఆ అంశమును మానివేయగలమా? (10) ప్రభువు సువార్త పనిమీద 70మందిని పంపెను. ఇది సువార్తలలో ఎందుకు వ్రాయబడెను? మన బోధ నిమిత్తమే గదా! ప్రభువు మనలను పిలిచి, సువార్తకు వెళ్ళండని చెప్పారు. ఒక్కసారే చెప్పివేసెను. (11) యెఫ్తా న్యాయాధిపతి యుద్ధమునకు వెళ్ళి జయము పొంది తిరిగి వచ్చుచుండెను. అప్పుడు తన ఏకైక పుత్రికయగు కన్యక ఎదురు పడెను. అందుచేత తన మ్రొక్కుబడి ప్రకారము ఆమెను దేవునికి సమర్పణ చేయవలసి వచ్చినను సమర్పించి వేసెను. (కుమార్తెకూడా సమ్మతించెను). మీలో ఎవరి బిడ్డనైన దేవుని సేవకు ప్రత్యేకించి సమర్పణ చేయగలరా? (12) అబ్రాహాము దైవభయము గలవాడై తన ఏక పుత్రుని తన చేతులతో బలి చేయ నిశ్చయించుకొనెను. ఇది తల్లిదండ్రులైనవారు గ్రహించలేని గొప్ప సమస్య. ఇస్సాకుకూడా సమ్మతించుట ఆశ్చర్యమే. (13) యేసుప్రభువు ఒక మాట చెప్పెను. నా తండ్రి చిత్తము నెరవేర్చుటయే నాకు ఆహారము. ప్రియులారా! దేవుని చిత్తము నెరవేర్చుట మనకు కూడా అన్నము తిన్నట్లుగానే ఉండునా?

# 9. సమర్పణ ప్రార్థన

నీ చిత్తము అబ్రాహాము నెరవేర్చినట్లు, మేమును నెరవేర్చునట్లు 'చిత్తము ప్రభువా!' అనేటట్లు దీవించుము. ఇస్సాకు బలి అయినట్లు నీకు మేము సమర్పణ అయేటట్లు దీవించుము. మాలో ఏ మంచి కార్యము జరిగినా నీ కార్యములకు ముంగుర్తు అయేటట్లు దీవించుము. పొట్టేలువలె ధనము ఇచ్చినావు. నీ సేవలో వాడునట్లు దీవించినందుకు స్తోత్రములు. ప్రభువా! నీవు ఏమి చెప్పితే అది చేయునట్లు గొప్ప మంచి మనస్సు ఉండునట్లు దీవించుము. ఏ గొప్ప కార్యమును చేయనుద్దేశించిన, నీ చిత్తములో చేయునట్లు దీవించుము. మరణమంత కష్టమున్నను సమర్పణ చేయునట్లు దీవించుము. ఇస్సాకునకు మరణములేదు. ఇస్సాకునకే జయముగాని మరణమునకుకాదు. ఇప్పుడు చేయు మంచి కార్యములు రాబోయే కాలమునకు మేలు. మాదిరి, ముంగుర్తుగానుండునట్లు దీవించుము. నీ సేవలో ఏది చేసినను ఈ కాలము నిమిత్తమును, రాబోవు కాలమునకు ఉపయోగముగా నుండునట్లు దీవించుము.

సర్వస్వాధీనపరుడవైన త్రియేకదేవా! మేము నీ స్వాధీనము. నీ వాక్కును మరియు నీ భూమియు సమస్తమును నీ సొత్తు గనుక మేము నీ చిత్తానుసారముగా చేయవలెను. గాని మా ఇష్టప్రకారము చేయవీలులేదు. గత కాల భక్తులందరు నీ స్వాధీనము. నీ వాక్కు నీ సంపాదనయైయున్నారు. నీ చిత్తమును నెరవేర్చునపుడు మాకు శ్రమ నొప్పి, శ్రమ, బాధ గానీ, నీ చిత్తములో మా చిత్తములు ఏకీభవింపజేసినపుడు మాకు బలము,

ఆనందము, జీవము. అప్పుడు మా సంపాదన దేవుడవు, రక్షకుడవు సమస్తమునైయున్న. సమస్తమునై యుందువు.

దయగల ప్రభువా! మేము నీ స్వాధీనము. నీవు మా స్వాధీనము. మా చిత్తము నీ చిత్తముయొక్క స్వాధీనము. నీ గ్రంధము మా స్వాధీనము. మాకు కలిగినదంతయు నీకు సమర్పించుకొంటే ఆస్తి, సంపాదన, కష్టములు, లోపములు అన్నీ నీకు సమర్పించుకొంటే నీకున్నవన్నీ మావి.

అంతయు మనదేగదా యేసునికున్న ॥బహుగా॥

ప్రభువా! ఇంకేమున్నది. మేము నీకు సమర్పణ చేసిన వాటికంటే ముందే నీవు మా నిమిత్తము సమర్పణయైనావు. మాదొక రకమైన సమర్పణ. నీదొక రకమైన సమర్పణ. నీ సమర్పణనుబట్టి మా సమర్పణ. మొదటే నీ సమర్పణ. భూమి పుట్టనప్పటికంటే ముందే కొన్నివందల ఏండ్లముందే నీ ప్రాణ సమర్పణ చేసినావు. గాని మేమిప్పుడు గ్రహించుచున్నాము. భక్తులందరు నీకు సమర్పణయైనారు. వారే ముందు సమర్పణయైనారని అనుకొంటున్నాము. గాని జగత్తు పునాది వేయబడకముందే నీవు సమర్పణయైనావని పేతురు వ్రాసెను. పాత నిబంధన భక్తులకంటే, క్రొత్త నిబంధన భక్తులకంటే నీవే ముందు సమర్పణ. సిలువమీద నీవు చేసిన సమర్పణను అప్పుడు మేము లేము గనుక చూడలేదు. అప్పుడున్న వారు చూచారు. గాన నీ సమర్పణ ఇప్పుడు చూస్తున్నాము.

భూగోళము, మేము పుట్టకముందే నీవు మాకు సమర్పించినావు. తరువాత నీవు సమర్పణయైనావు, గనుక మేము నీకు సమర్పించుకొనవలెను. ఆ రెండు గోళములుగాక మా ప్రాణమును, శరీరమును సమర్పించినావు.

పరలోకము పరలోకమునే మాకు సమర్పింపనై యున్నావు. కాబట్టి దానికి అంతములేదు. గాన మా చిత్తము లేక ఇష్టము, నీకు సమర్పింపవలెను. ప్రభువా! ఇద్దరి సమర్పణను గూర్చి మా జ్ఞానమును వెలిగించుము. మా మనస్సాక్షిని శుద్ధీకరించుము. మా ఆత్మను ప్రత్యక్షతతో నింపుము. ప్రార్ధనను, మా సమస్తమును అట్లే సమర్పించుకొమ్మని త్వరలో రానైయున్న యేసుప్రభువుద్వారా వేడుకొంటున్నాము. ఆమేన్.

## 10. 'సమర్పణ' న్యాయాధి. 11:29.

**ప్రార్ధన:-** ఈ దిన కార్యక్రమమంతటిని దీవించుము. నీవు దేవుడవు. మేము మనుష్యులము. నీ సంగతులను మేము గ్రహించలేము. అయినను నీవు తెలియజేయుచున్నందుకు స్తోత్రములు. వర్తమానమును నిన్న ఇచ్చినావు. స్తోత్రములు. ఈ వేళ ఇవ్వనైయున్నావు స్తోత్రములు. మేము నీ చిత్తమునకు బంధింపబడే వర్తమానమిమ్ము. మీరు నోవహును ఓడ కట్టమన్నారు అతడేమియు ప్రశ్నవేయకుండగా గొప్ప అద్భుతము జరిగింది. ఎందుకంటే ప్రశ్నలు వేయకుండ నీవు చెప్పినట్టు చేసినాడు. గనుక అది జరిగింది. ఎంత గొప్ప విధేయత. భక్తి అనగా అదే. మాకుకూడా అట్టిది దయచేయుము.

గోఫెరు కర్రతో అతడు కట్టిన నావ నీ కుమారునితో కట్టిన సంఘమునకు ముంగుర్తు. అట్టి విధేయత స్థితి మాకు దయచేయుము. నీవు చెప్పినట్లు కర్రతో కట్టాడు. గొప్ప పేరు వచ్చింది. కర్రతో కట్టిన నావకు, భక్తులతో నీవు కట్టిన సంఘ ఓడకు ముంగుర్తు అనేపేరు వచ్చింది. మనుష్యులు తప్పు చేస్తే మాత్రము అంత శిక్షా ప్రభువా! అనే మొదలైన

ప్రశ్నలేమి వేయక నీవు ఆజ్ఞాపించినట్లు చేసాడు గనుక నీయందు విశ్వాసముంచిన మనుష్యులతో కట్టబడిన సంఘము, ఓడకు ముంగుర్తు అను పేరు వచ్చినది. ఆ కర్ర ఓడ ఏ మాత్రము. ఒక్క ఆర్మీ ఆ దేశములోనిది మాత్రమే గనుక అది అంత గొప్పదికాదు. నీవు కట్టే ఓడ భూలోకమంతటికి సంబంధించిన సంఘమనే ఓడకు ముంగుర్తు అయ్యేటంత ఘనత వచ్చినది. ఎందుకంటే ఆయన తన్నుతాను నీ ఆజ్ఞకు ఆపాదించుకొన్నాడు. మేమును అట్లే మా చిత్తమును నీ చిత్తమునకు బంధించే సమర్పణ మాకు దయచేయుము.

కర్రతో కట్టబడక సజీవులైన మనుష్యులతో కట్టబడిన నావకు ముంగుర్తుగానుండే గొప్ప స్థితియే దాని స్థితి. ఓడ కాలాల ప్రకారము కట్టుట, ఎన్నడు జరుగని ప్రవాహమును సహించి ఓడ కట్టెను. అది నీవు చెప్పినట్లు చేయుటలో ఉన్నది. మేముకూడ నీవుచెప్పిన దానికి ఎదురు చెప్పకుండా లోబడే కృప దయచేయుము. నోవహు ప్రత్యక్షత గొప్పది. ఎందుచేత? అతని హృదయ పరిశుద్ధత అంత గొప్పది. ఒక మనిషి మనిషితో చెప్పినట్లు చెప్పినావు. నీ ఆజ్ఞ ప్రకారము అతడు చేసినాడు. గనుక నీ చిత్త ప్రకారం సమర్పణ కావాలి.

నీ చిత్తము చూచి చిత్తము ప్రభువా! అనే సమర్పణ మాకిమ్ము. మేమైతే ఎన్నో ప్రశ్నలు వేసియుందుము. నోవహు ఓడ ఎంత గొప్పదంటే సంఘ ఓడకు పోలికగా ఉండేటంత గొప్పది. ఎవరు నీ చిత్తమునకు ఎదురు చెప్పరో, ప్రశ్న వేయరో వారికి నీ మర్మము బైలుపర్చుదువు. తన చిత్తమును బంధించి, చిత్తము ప్రభువా! అని నీ చిత్తమునకు ఒప్పచెప్పుకున్నాడు.

మాస్టరు పిల్లలకు చెప్పినట్లు నీవు నోవహుకు డిక్టేటు చేయగా లేక డ్రాయింగు వేయమనగా వెంటనే చేసెను. పిల్లలైతే ఇంకొకసారి చెప్పమందురు. నోవహు అట్లు అడుగలేదు. ఈ మధ్య ఆ ఓడ నేటికాల ప్రజలకు బైలుపడినది. ముంచే వానవచ్చి నోవహు ఓడను తేల్చే. ఓడ అయింది. ఎందుచేతనంటే నీవు చెప్పినట్లు చేసినాడు. నీ ఆజ్ఞ దుర్జనులను ముంచును. సజ్జనులను తేల్చును. నీవు (నోవహు) అతనిని కట్టినావు. గనుకఅతడు ఓడ కట్టినాడు. నీవు చెప్పినట్లు చేస్తే గొప్ప అద్భుతములు ఈ వేళకూడా జరుగును. అతడు నీవు చెప్పగా నీ చిత్తము ప్రభువా! అనగానే ఎంతో అద్భుతము జరిగెను. మేముకూడా నీవు చెప్పినట్లు చేసే కృప దయచేయుము.

ఉపాధ్యాయుడు పిల్లవానిని కూర్చోబెట్టి డ్రాయింగు ఇక్కడనుండి ఇక్కడకు ఇది ఇక్కడ ఇది, అని ఎట్లు చెప్పునో అట్లే నీవు ముఖాముఖిగా నీవు చేయించినావు. ఎందుచేతనంటే నీవు చెప్పినట్లు చేస్తాడు. ఆదికాండములో ఒక చిన్న వాక్యమున్నది. దేవుడు చెప్పినట్లు నోవహు చేసెను. గనుక (Certificate) ఇచ్చినావు. అట్టి సర్టిఫికెట్ మాకు కూడా ఇమ్ము. వెర్రిబాగులవానివలె ప్రశ్నలు వేయకుండా చెప్పినట్లు చేసాడు. మా గదిలో నోవహువలె ఎవరికి ప్రత్యక్షత కావలెనో అట్టివారికి ఈ పాఠమే గొప్పది. నోవహు వంటి విధేయత మాకుకూడా దయచేయుము. తెలుసుకొనుటకైనా ప్రశ్నలు వేయలేదు. ఎంత గొప్ప విధేయత. అబ్రాహామైన వేశారు. 50మంది ఉంటే నాశనము చేస్తావా? ఆ జనుడే దైవజనుడు. ఎంత ఘనుడు! నోవహు మాతో ఎవరికైనా నీవేమైనా చెప్పితే ఎన్నో ప్రశ్నలు వేయుదుము. నీవు చెప్పినట్లు నోవహు చేశాడు. కనుక తన కుటుంబాన్ని

సృష్టినికూడా రక్షించాడు. అట్టి కృప మాకును దయచేయుము. కర్ర నావ గొప్పదా? వెర్రివాడైన నోవహు గొప్పవాడా? అని ప్రశ్నవేస్తే సమర్పణ. మన దేశములోనున్న చితిసారకపు కర్రతో సమానమని తెలుగు బైబిలులో చితిసారకపు కర్ర అనేయున్నది. మన ఆలోచన వేరు. దైవాజ్ఞవేరు. ప్రభువే అన్ని రకములుగా మనకు ప్రత్యక్షపరచగలరు.

**ప్రత్యక్షతలు:–**

1) దర్శనము:– దర్శనము కావలసివస్తే ఆయన చెప్పినట్లు చేయండి.

2) స్వరము వినవలెను:– ఆలాగైతే ఆయన చెప్పినట్లు చేయండి. ' నా గొర్రె నా స్వరము వినును'.

3) వ్రాత:– వ్రాత కావలెనా ఆయన చెప్పినట్లు చేయండి. ముందు వాక్యములో ఉన్నట్టు చేయండి. అప్పుడు నేను చెప్తూతాను.

4) స్వప్నము:– స్వప్నముద్వారా దేవుడు తన చిత్తము బైలుపర్చును.

5) ఉపప్రత్యక్షత:– ఆయన చెప్పినట్లు చేస్తే అది దేనిదో దేవునిదో, సాతానుదో, స్వంతదో తెలియును. దేవుడు చెప్పినదానికి ఇంకేమియు ప్రశ్నలుండరాదు. ఉంటే అవి ఒక్క దేవుడు చెప్పిన వాటన్నిటికి వ్యతిరేకమైనవన్ని సాతాను చేయును. ప్రభువు చేసిన దానికి వ్యతిరేకముగా దయ్యము చెప్పితే తండ్రినడుగవచ్చును.

# ప్రకటన గ్రంథములోని స్తుతులు

1. ప్రకటన 1:6. మనలను ప్రేమించుచు తన రక్తము వలన మన పాపములనుండి మనలను విడిపించిన వానికి మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగునుగాక! ఆమేన్.

2. ప్రకటన 1:18. భయపడకుము, నేను మొదటివాడను, కడపటివాడను, జీవించువాడను, మృతుడనైతినిగాని ఇదిగో యుగ యుగములు సజీవుడనైయున్నాను. మరియు మరణముయొక్కయు పాతాళ లోకముయొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో ఉన్నవి.

3. ప్రకటన 4:8,9 (4 జీవులు చేసిన స్తుతి) భూత వర్తమాన భవిష్యత్కాలములలో ఉండు సర్వాధికారియు దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని మానక రాత్రింబగళ్ళు చెప్పుచుండును. ఆ సింహాసనమునందు ఆసీనుడైయుండి యుగయుగములు జీవించుచున్న వానికి మహిమయు ఘనతయు కృతజ్ఞతా స్తుతులును కలుగునుగాక!

4. ప్రకటన 4:10-11. (24గురు పెద్దలు చేసిన స్తుతి) సింహాసనమునందు ఆసీనుడై యుండువాని ఎదుట సాగిలపడి యుగ యుగములు జీవించుచున్నవానికి నమస్కారము చేయుచు- ప్రభువా, మా దేవా, నీవు సమస్తమును సృష్టించితివి. నీ చిత్తమునుబట్టి అవియుండెను. దానిని బట్టియే సృష్టింపబడెను. గనుక నీవే మహిమ ఘనత ప్రభావములు పొందనర్హుడవని చెప్పుచు తమ కిరీటములను ఆ సింహాసనము ఎదుట వేసిరి.

5. ప్రకటన 5:9,10 (4 జీవులు 24గురు పెద్దలు చేసిన స్తుతి) నీవు ఆ గ్రంథమును తీసికొని దాని ముద్రలను విప్పుటకు యోగ్యుడవు. నీవు వధింపబడినవాడవై నీ రక్తమిచ్చి ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడువారిలోను, ప్రతి ప్రజలోను, ప్రతి జనములోను, దేవుని కొరకు మనుష్యులనుకొని, మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను, యాజకులనుగాను చేసితివి. గనుక వారు భూలోకమందు ఏలుదురని క్రొత్తపాట పాడుదురు.

6. ప్రకటన 5:12 (దేవదూతల స్తుతి) వారు వధింపబడిన గొర్రెపిల్ల శక్తియు, ఐశ్వర్యమును, జ్ఞానమును, బలమును, ఘనతయు, మహిమయు, స్తోత్రమును పొందనర్హుడని గొప్ప స్వరముతో చెప్పుచుండిరి.

7. ప్రకటన 5:13-14 (సమస్త సృష్టియు చేసిన స్తుతి) సింహాసనాసీనుడైయున్న వానికిని గొర్రెపిల్లకును స్తోత్రమును ఘనతయు, మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగునుగాకని చెప్పుట వింటిని. ఆ నాలుగు జీవులు ఆమేన్ అని చెప్పగా ఆ పెద్దలు సాగిలపడి నమస్కారము చేసిరి.

8. ప్రకటన 6:9-10 (హతసాక్షులు చేసిన స్తుతి) వారు నాథా! సత్యస్వరూపీ, పరిశుద్ధుడా, యెందాక తీర్పు తీర్చకయు, మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని బిగ్గరగా కేకలు వేసిరి.

9. ప్రకటన 7:10 (రక్షింపబడిన 144వేల మంది చేసిన స్తుతి) సింహాసనము ఎదుట గొర్రెపిల్ల ఎదుటను నిలువబడి సింహాసనాసీనుడైన మా దేవునికిని గొర్రెపిల్లకును మా రక్షణకై స్తోత్రమని మహా శబ్ధముతో ఎలుగెత్తి చెప్పిరి.

Bible Mission HQ Guntur

10. ప్రకటన 7:11-12 (దేవదూతల స్తుతి) వారు సింహాసనము ఎదుట సాష్టాంగపడి ఆమేన్, యుగయుగములవరకు మా దేవునికి స్తోత్రమును మహిమయు జ్ఞానమును కృతజ్ఞతాస్తుతియు ఘనతయు శక్తియు బలమును కలుగునుగాకని చెప్పుచు దేవునికి నమస్కారము చేసిరి ఆమేన్.

11. ప్రకటన 10:6 (పరలోకమునుండి దిగివచ్చిన బలిష్ఠుడైన దూత చెప్పినది) పరలోకమును అందులో ఉన్నవాటిని, భూమిని అందులో ఉన్నవాటిని, సముద్రమును అందులో ఉన్నవాటిని, సృష్టించి, యుగయుగములు జీవించుచున్న వానితోడు ఒట్టుపెట్టుకొని ఇక ఆలస్యముండదుగాని దేవుడు తన దాసులగు ప్రవక్తలకు తెలిపిన సువార్త ప్రకారము దేవుని మర్మము సమాప్తమగునని చెప్పెను.

12. ప్రకటన 11:15 (పరలోకమునుండి దిగివచ్చిన శబ్దము) ఈ లోకరాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యమునాయెను. ఆయన యుగయుగముల వరకు ఏలుననెను.

13. ప్రకటన 11:17-18 (24గురు పెద్దలు చేసిన స్తుతి) వర్తమాన, భూతకాలములలో ఉండు దేవుడవైన ప్రభువా! సర్వాధికారీ, నీవు నీ మహాబలమును స్వీకరించి ఏలుచున్నావు. గనుక మేము నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాము. జనములు కోపగించినందున నీకు కోపము వచ్చెను. మృతులు తీర్పు పొందుటకును, నీ దాసులగు ప్రవక్తలకును పరిశుద్ధులకును, నీ నామమునకు భయపడువారికిని, తగిన ఫలము నిచ్చుటకును గొప్పవారేమి, కొద్దివారేమి భూమిని నశింపజేయువారిని నశింపజేయుటకును సమయము వచ్చియున్నదని చెప్పిరి.

14. ప్రకటన 12:9 (పరలోకమునుండి వచ్చిన శబ్ధము) కాగా సర్వలోకమును మోసపుచ్చుచు, అపవాదియనియు, సాతాననియు పేరుగల ఆదిసర్పమైన ఆ మహాఘటసర్పము పడద్రోయబడెను. అది భూమిమీద పడద్రోయబడెను. దాని దూతలు దానితోకూడ పడద్రోయబడిరి.

15. ప్రకటన 12:10-12 (పరలోకమందు) రాత్రింబగళ్ళు మన దేవుని ఎదుట మన సహోదరులమీద నేరము మోపువాడైన అపవాది పడద్రోయబడియున్నాడు. గనుక ఇప్పుడు రక్షణయు, శక్తియు, రాజ్యమును మన దేవునివాయెను. ఇప్పుడు అధికారము ఆయన క్రీస్తుదాయెను. వారు గొర్రెపిల్ల రక్తమును బట్టియు, తామిచ్చిన సాక్ష్యమునుబట్టియు వానిని జయించియున్నారు. గాని మరణము వరకు తమ ప్రాణములను ప్రేమించినవారుకారు. అందుచేత పరలోకమా పరలోక నివాసులారా! ఉత్సహించుడి; భూమీ, సముద్రమా మీకు శ్రమ. అపవాది తనకు సమయము కొంచెమే అని తెలిసికొని బహు క్రోధము గలవాడై మీయొద్దకు దిగి వచ్చియున్నాడని చెప్పెను.

16. ప్రకటన 14:7 (దేవదూత చెప్పినది) మీరు దేవునికి భయపడి ఆయనను మహిమ పరచుడి. ఆయన తీర్పుతీర్చు గడియవచ్చెను. గనుక ఆకాశమును, భూమిని, సముద్రమును, జలధారలను కలుగజేసిన వానికే నమస్కారము చేయుడి అని గొప్ప స్వరముతో చెప్పెను.

17. ప్రకటన 14:8 (వేరొకదూత చెప్పినది) మోహోద్రేకముతో కూడిన తన వ్యభిచార మద్యమును సమస్త జనములకు త్రాగించిన ఈ మహా బబులోను కూలిపోయెను కూలిపోయెను అని చెప్పెను.

18. ప్రకటన 15:3-4 (క్రూరమృగమునకు లోబడనివారు చేసిన స్తుతి) ప్రభువా, దేవా, సర్వాధికారీ, నీ క్రియలు ఘనమైనవి, ఆశ్చర్యమైనవి, యుగములకు రాజా, నీ మార్గములు న్యాయములును, సత్యములునైయున్నవి. ప్రభువా, నీవు మాత్రము పవిత్రుడవు, నీకు భయపడని వాడెవడు? నీ నామమును మహిమపరచని వాడెవడు? నీ న్యాయ విధులు ప్రత్యక్ష పరచబడినవి గనుక జనములందరు వచ్చి నీ సన్నిధిని నమస్కారము చేసెదరని చెప్పుచు దేవుని దాసుడగు మోషే కీర్తనయు గొర్రెపిల్ల కీర్తనయు పాడుచున్నారు.

19. ప్రకటన 16:5-7 (జలముల దేవదూత చెప్పినది) వర్తమాన భూత కాలములలో ఉండు పవిత్రుడా, పరిశుద్ధుల రక్తమును, ప్రవక్తల రక్తమును వారు కార్చినందుకు తీర్పుతీర్చి వారికి రక్తము త్రాగనిచ్చితివి, దీనికి వారు పాత్రులే. నీవు ఈలాగు తీర్పు తీర్చితివి గనుక నీవు న్యాయవంతుడవని జలముల దేవదూత చెప్పగా వింటిని. అందుకు- అవును ప్రభువా, దేవా, సర్వాధికారీ, నీ తీర్పులు సత్యములును న్యాయములునై యున్నవని బలిపీఠము చెప్పుట వింటిని.

20. ప్రకటన 16:15-16. (ప్రభువు చెప్పినది) ఇదిగో నేను దొంగవలె వచ్చుచున్నాను. తాను దిగంబరుడుగా సంచరించుచున్నందున జనులు తన దిసమొలను చూతురేమో అని మెలకువగా ఉండి తన వస్త్రము కాపాడుకొనువాడు ధన్యుడు.

21. ప్రకటన 17:14 (దూత చెప్పినది) వీరు గొర్రెపిల్లతో యుద్ధము చేతురుగాని, గొర్రెపిల్ల ప్రభువులకు ప్రభువును, రాజులకు రాజునై

యున్నందునను, తనతోకూడ ఉండినవారు పిలువబడినవారై, ఏర్పరచబడిన వారై నమ్మకమైనవారై యున్నందునను, ఆయన ఆ రాజులను జయించును.

22. ప్రకటన 18:20 (దూతలు చెప్పినది) పరలోకమా పరిశుద్ధులారా, అపోస్తలులారా, ప్రవక్తలారా దానిగూర్చి ఆనందించుడి. 'ఏలయనగా దానిచేత మీకు కలిగిన తీర్పుకు ప్రతిగా దేవుడు ఆ పట్టణమునకు తీర్పుతీర్చి యున్నాడు'.

23. ప్రకటన 19:1-7 (పరలోకములోని జయశబ్ధము) ప్రభువును స్తుతించుడి, రక్షణ మహిమ ప్రభావములు మన దేవునికే చెల్లును. ఆయన తీర్పులు సత్యములును న్యాయములునైయున్నవి. తన వ్యభిచారముతో భూలోకమును చెరిపిన గొప్ప వేశ్యకు ఆయన తీర్పు తీర్చి, తన దాసుల రక్తమును బట్టి దానికి ప్రతిదండన చేసెను. మరి రెండవసారి వారు ప్రభువును స్తుతించుడి అనిరి. ఆ పట్టణపు పొగ యుగయుగములు పైకి లేచుచున్నది. అప్పుడు ఆ 24గురు పెద్దలును నాలుగు జీవులును సాగిలపడి ఆమేన్. ప్రభువును స్తుతించుడి అని చెప్పుచు సింహాసనాసీనుడగు దేవునికి నమస్కారము చేసిరి. మరియు మన దేవుని దాసులారా, ఆయనకు భయపడువారలారా, కొద్దివారేమి, గొప్పవారేమి మీరందరు ఆయనను స్తుతించుడి అని చెప్పుచున్న యొక స్వరము సింహాసనమునొద్దనుండి వచ్చెను. అప్పుడు గొప్ప జనసమూహపు శబ్ధమును విస్తారమైన జలముల శబ్ధమును బలమైన ఉరుముల శబ్ధమును పోలినయొక స్వరము సర్వాధికారియు ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు. ఆయనను స్తుతించుడి. గొఱ్ఱెపిల్ల

వివాహోత్సవ సమయము వచ్చినది. ఆయన భార్య తన్ను తాను సిద్ధపరచుకొనియున్నది. గనుక మనము సంతోషపడి ఉత్సహించి ఆయనను మహిమ పరచెదమని చెప్పగా వింటిని.

## ప్రకటన గ్రంథములోని ఏడు ధన్యతలు

1. దేవుని వాక్యము చదువువాడును ధన్యుడు, వాటిని విని గైకొనువారును ధన్యులు 1:3.
2. ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు 14:13.
3. మెలకువగా నుండి తన వస్త్రము కాపాడుకొనువాడు ధన్యుడు 16:16.
4. గొర్రెపిల్ల పెండ్లివిందుకు పిలువబడినవారు ధన్యులు 19:9.
5. మొదటి పునరుత్థానములో పాలుగలవారు ధన్యులు 20:6.
6. ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను. ఈ గ్రంథములోని ప్రవచన వాక్యములను గైకొనువాడు ధన్యుడు 22:7.
7. జీవ వృక్షమునకు హక్కుగలవారై, గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు 22:14.

Bible Mission HQ Guntur

గుంటూరు నందు :

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1968 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1972 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1978 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 1981 | ప్రతులు | 1000 |
| ఐదవ | ముద్రణ | 1985 | ప్రతులు | 2000 |
| ఆరవ | ముద్రణ | 1990 | ప్రతులు | 2000 |
| ఏడవ | ముద్రణ | 1993 | ప్రతులు | 5000 |
| ఎనిమిదవ | ముద్రణ | 1996 | ప్రతులు | 10,000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2003 | ప్రతులు | 5,000 |
| పదవ | ముద్రణ | 2004 | ప్రతులు | 10,000 |
| పదునొకండవ | ముద్రణ | 2007 | ప్రతులు | 5,000 |
| పన్నెండవ | ముద్రణ | 2008 | ప్రతులు | 5,000 |
| పదమూడవ | ముద్రణ | 2009 | ప్రతులు | 2,000 |
| పదునాల్గవ | ముద్రణ | 2009 | ప్రతులు | 3,000 |
| పదిహేనవ | ముద్రణ | 2010 | ప్రతులు | 5,000 |
| పదహారవ | ముద్రణ | 2011 | ప్రతులు | 10,000 |
| పదిహేడవ | ముద్రణ | 2013 | ప్రతులు | 5,000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు-522 509.

ఫోన్ : 9949121777.